## రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



బురదలో నిలబడి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 5 : సిర్పూర్ పేపర్ మిల్లుకు ముడి సరుకు తరలించే వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ గుంతలుగా మారుతున్నాయని, యాజమాన్యం మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బాలభారతి విద్యాలయ సమీపంలో ఏర్పడ్డ గుంతల్లో నిలబడి నిరసన తెలిపారు. అనంతరం మిల్లు ప్రతినిధులకు వినతిపత్రం అందించామన్నారు. నాయకులు అంబాల ఓదెలు, మనోహర్, సలీం, రాజు, పోచం పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

నస్పూర్, ఆగస్టు 5 : ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం కోసం దరఖాస్తు గడువును 10వ తేదీ వరకు పొడిగించినట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతీ ఆవిష్కర్త దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి, 15న అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

## కారులో మంటలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : మంచిర్యాల మార్కెట్ రోడ్డులో సోమవారం పార్కింగ్ చేసి ఉన్న ఓ కారులో మంటలు చెలరేగాయి. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల పట్టణానికి చెందిన నర్సింహస్వామి మార్కెట్‌లోని నర్సయ్య కంటి దవాఖాన ఎదుట తన కారును పార్కింగ్ చేసి వెళ్లాడు. ఒక్కసారిగా కారు నుంచి పొగలు వచ్చి, మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే వాటర్ పైప్ సాయంతో ఆర్పి వేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా అదుపుచేశారు. బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వచ్చాయని ఫైర్‌మన్ మల్లయ్య తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై దాడి

లక్షెట్టిపేట, ఆగస్టు 5 : పట్టణంలోని లంబాడీతండా, సత్యసాయి నగర్‌లో గుడుంబా స్థావరాలపై అబ్కారీ అధికారులు సోమవారం దాడులు చేశారు. 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. భూక్యా అనిత, భూక్యా లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు అబ్కారీ ఎస్ఐ శంకర్ తెలిపారు.

## జైపూర్ పీహెచ్‌సీ సందర్శన

జైపూర్, ఆగస్టు 5 : జైపూర్ పీహెచ్‌సీని సోమవారం జిల్లా ప్రోగ్రాం అధికారిణి అనిత సందర్శించారు. దవాఖా పరిసరాలను పరిశీలించారు. అనంతం రోగులతో మాట్లాడి, వైద్య సలహాలు, మందులు అందించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తిరుగుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు.

## ఘనంగా వనమహోత్సవం

చెన్నూర్ టౌన్, ఆగస్టు 5 : వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయం పక్కన సోమవారం మొక్కలు నాటారు. మున్సిపల్ సిబ్బంది, 18వ వార్డు కౌన్సిలర్ గర్రెపల్లి శాంతారాణి, ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

## బీఎన్ఆర్‌కేఎస్ ఆవిర్భావ దినోత్సవం

తాండూర్, ఆగస్టు 5 : మండల కేంద్రంలోని తాపీ సంఘం భవనం వద్ద సోమవారం బీఎన్ఆర్‌కేఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శి తాడూరి మొండయ్య, అశోక్, మండల ఉపాధ్యక్షుడు ఎండీ జాఫర్ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి వన్నెజాతుల శ్రీనివాస్, సభ్యులు నరియ బాలు, ఇడిదినేని బాలు, పూదరి మల్లేశ్ పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్/హాజీపూర్/బెల్లంపల్లి/జన్నారం/సీసీసీ నస్పూర్/శ్రీరాంపూర్/వేమనపల్లి/బెజ్జూర్/చింతలమానేపల్లి/కౌటాల/దండేపల్లి/జైపూర్/పెంచికల్‌పేట్/చెన్నూర్ రూరల్/కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ రూరల్/లక్షెట్టిపేట/మందమర్రి/చెన్నూర్/కాసిపేట/తాండూర్/కన్నెపల్లి/వాంకిడి/కెరమెరి, ఆగస్టు 5 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని చోట్లా అవగాహన ర్యాలీలు తీశారు. ఆయా చోట్ల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంచిర్యాల మున్సిపాలిటీలోని 15వ వార్డులో కమిషనర్ మారుతీ ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వర్, మెప్మా ఆర్పీ, స్థానికులతో కలిసి చైర్మన్ ఉప్పలయ్య మొక్కలు నాటారు. అన్ని వార్డుల ఆఫీసర్లతో సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వర్ సమావేశమయ్యారు. హాజీపూర్ మండల ప్రత్యేకాధికారి, డీఈవో యాదయ్య ముల్కల్ల జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనం గురించి వివరించారు. రాపల్లిలో మండల పశు వైద్యాధికారి శాంతి రేఖ పలు విషయాలను వివరించారు. బెల్లంపల్లి పట్టణంలోని పాత పురపాలక సంఘ కార్యాలయం నుంచి చాంటా చౌరస్తా వరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. కొత్తబస్టాండ్ ఏరియాతో పాటు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో చెత్తచెదారాన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించారు. దుకాణదారులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. మండలంలోని బూధఖుర్ద్, కన్నాల, అంకుశం, సోమగూడెం, ఆకెనపల్లి, చాకెపల్లి గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందితో అధికారులు ర్యాలీ తీశారు. లంబడీతండా, గురిజాల గ్రామాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో శ్రమదానం చేశారు. పాత బెల్లంపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చాకెపల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థులతో మండల ప్రత్యేకాధికారి ఎస్ కిషన్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై, మొక్కలు నాటారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్ కార్యక్రమం ప్రారంభించారు. రాయల్ టాకీస్ రోడ్‌లో విద్యార్థులతో ర్యాలీ తీశారు. వేమనపల్లి మండల కేంద్రంతో పాటు నీల్వాయి, నాగారం సూరారం, కల్లెంపల్లి, సుంపుం, బుయ్యారం తదితర గ్రామాల్లో ర్యాలీ తీశారు. గ్రామసభలు ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. బెజ్జూర్ మండలంలో కార్యదర్శులు గ్రామస్తులతో ర్యాలీ తీశారు. చింతలమానేపల్లిలోని పాల్వాయి నగర్ పాఠశాల ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ మస్కూర్ అలీ అధికారులతో మొక్కలు నాటారు. రవీంద్రనగర్-1 పీహెచ్‌సీలో వైద్య, పంచాయతీ సిబ్బందితో శ్రమదానం చేశారు. కౌటాల మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఎంపీడీవో కోట ప్రసాద్ ర్యాలీ తీశారు. ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో శ్రమదానం చేశారు. ముత్తంపేట పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో కాంప్లెక్స్ హెచ్ఎం గావుడే హన్మంతు ఆధ్వర్యంలో ముత్తంపేట, శిర్షా గ్రామాల ప్రాథమిక పాఠశాలల పరిధిలో అవగాహన ర్యాలీ తీసి, మొక్కలు నాటారు. దండేపల్లి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ, గూడెంలో వనమహోత్సవం నిర్వహించారు. జైపూర్ మండలం ఇందారంలో మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో గణపతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పెంచికల్‌పేట్ మండలంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావుతో కలిసి ఎంపీడీవో ఆల్బర్ట్ బస్టాండ్ ఆవరణలో చెత్త సేకరణ, పిచ్చిమొక్కల తొలగింపు నిర్వహించారు. చెన్నూర్ మండలం కిష్టంపేటలో డీపీవో వెంకటేశ్వర్ రావు, కొమ్మెరలో తహసీల్దార్ మల్లికార్జున్ కార్యక్రమం నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచనలు చేశారు. లారీ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. పట్టణంలో పునర్నవ సోషల్ ఫౌండేషన్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ సహకారంతో కమిషనర్ ఎస్ అంజయ్య, పీపీఎస్ఎఫ్ డైరెక్టర్ అశోక్ భాగసామ్యంతో ర్యాలీ తీశారు. లక్షెట్టిపేట పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బందితో కలిసి మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, అధికారులు, కౌన్సిలర్లు ర్యాలీ తీశారు. మందమర్రి మున్సిపల్ అధికారులు, మెప్మా ఆర్పీలు శాంతినగర్, విద్యానగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీల మీదుగా పాతబస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో, చెన్నూర్ పట్టణంలోని 16వ వార్డు కొత్త గూడెం కాలనీలో ర్యాలీ తీశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కాసిపేట మండలం పెద్దనపల్లి జీపీలో మండల ప్రత్యేకాధికారి గంగారాం, డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ ప్రజలకు సూచనలు చేశారు. సోమగూడెం(కే)లో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. తాండూర్, కన్నెపల్లి, భీమిని మండలాల్లోని అన్ని జీపీ కార్యాలయాల ప్రాంగణాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. వాంకిడి మండల కేంద్రంలో అధికారులు విద్యార్థులతో ర్యాలీ తీశారు. కెరమెరి మండలం కొటారిలో ఎంపీడీవో అహ్మద్ అమ్జద్‌పాషాతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెబ్బెన మండలంలోని అన్ని జీపీల్లో కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో శంకరమ్మ తెలిపారు.



కాగజ్‌నగర్ : ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



మంచిర్యాలటౌన్ : మొక్కలు నాటుతున్న చైర్మన్, కమిషనర్

# ఆర్టీసీ బస్సు ఢీ..నలుగురికి గాయాలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో గల ఐలాండ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలవగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. మంచిర్యాల డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు గోదావరిఖని నుంచి మంచిర్యాలకు వస్తున్నది. డ్రైవర్ గణపతి అతివేగంగా, బస్సు నడుపుతూ రెండు బైకులను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఒక బైకు బస్సు టైర్ల కింద నలిగిపోగా, 30 మీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. మరో బైకు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో సాయికుంటకు చెందిన రేకుంట రమేశ్, తన కూతురు దీపకు తీవ్రగాయాలయ్యాయి. మరో బైక్‌పై ఉన్న భూపాలపల్లి జిల్లా మొగులపల్లి మండలం, బండ్లపల్లి గ్రామానికి చెందిన బండి మహేశ్, శ్రీరాంపూర్ ఆర్కే-6 కొత్త రోడ్డుకు చెందిన భీర్తి నవీన్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు దవాఖానకు తరలించారు. రమేశ్, దీపను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ ప్రమాదంతో సుమారు గంటన్నర పాటు ఇరు వైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ క్లియర్ చేశారు. అనంతరం వివరాలు సేకరించి, కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



వైద్యులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ బన్సీలాల్

## 'మా భూమి ఇప్పించండి'

తాండూర్, ఆగస్టు 5 : ప్రభుత్వం తమకు ఇచ్చిన సీలింగ్ భూమిని కొందరు ఆక్రమించుకొని రైస్‌మిల్ నిర్మాణం చేపడుతున్నారని, న్యాయం చేయాలని బాధితులు మెడే పెంటయ్య, కాటపాటి మురళి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండలంలోని తాండూర్ శివారు సర్వే నంబర్ 669/12/1లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 7 ఎకరాల సీలింగ్ భూమిని ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిందన్నారు. అందులో నుంచి 3.45 ఎకరాలను కొందరు ఆక్రమించి, రైస్‌మిల్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారిలో బాధితులు సాయి, దాసరి శ్రీనివాస్, మెడే చిన్నక్క, గౌరక్క, దాసరి లక్ష్మి ఉన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చెన్నూర్, ఆగస్టు 5 : చెన్నూర్ మహాత్మాజ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-18 విభాగంలో టీ ప్రశాంత్ 400మీటర్ల పరుగు పందెలో ప్రథమ.., అండర్-14 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో టీ రిషిత్ ప్రథమ.., టీ సాయిరుత్విక్ ద్వితీయ.., అండర్-14 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో కే మణికంఠ ప్రథమ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఏటీపీ శ్రీకాంత్, పీఈటీ విజయ్‌కుమార్, డిప్యూటీ వార్డెన్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## సద్వినియోగం చేసుకోవాలి

కాసిపేట, ఆగస్టు 5 : తపాలా శాఖ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి సబ్ డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ విక్రం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తపాలా శాఖ పొదుపు పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలపై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపోలు తాజుద్దీన్, మధుకర్, బీపీఎం భూమన్న, అమూల్, సురేశ్, హమీద్, శంకరయ్య, నాయకులు రత్నం ప్రదీప్, మైదం రమేశ్, గోలేటి స్వామి, దారవేణి రాజయ్య, రాజ్‌కుమార్, వెంకటేశ్, జంపయ్య, రామ్మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దండేపల్లి, ఆగస్టు 5 : మండలంలోని మేదరిపేట జీపీ కార్యాలయంలో తపాలా సేవలపై ఆ శాఖ ఏఎస్‌పీ రామారావు అవగాహన కల్పించారు. ఎస్‌పీఎం గురువయ్య, మాజీ సర్పంచ్ డాంక లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ కొంగల నవీన్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఏఈవో సృజన్య, బీపీఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5 : మండలంలోని వేంపల్లి గ్రామంలో ప్రజలకు మంచిర్యాల ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ సాగర్ తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, ఇతర తపాలా సిబ్బంది, కార్యదర్శి పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధి సాధించాలి

జైనూర్ ఆగస్టు 5 : స్వయం ఉపాధితో గ్రామీణ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాణి దుర్గావతి ట్రస్ట్ అధ్యక్షురాలు గోడం జంగుబాయి అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని రాణి దుర్గావతి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం ఉత్తీర్ణత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాంబాయి గంగామణి, అనసూయ మహిళలు పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మె

కాగజ్‌నగర్, ఆగస్టు 5 : కాగజ్‌నగర్ మున్సిపాల్ కార్మికులు వేతనాల కోసం కార్యాలయ ఆవరణలో పది రోజులుగా సమ్మె చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, సోమవారం పాలకవర్గ సభ్యులు, కమిషనర్ అజయ్య కార్మికులతో మాట్లాడారు. త్వరలో వేతనాలు చెల్లించి, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్ జైచందర్, ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపేటలో తల్లిపాల వారోత్సవాలు

దండేపల్లి, ఆగస్టు 2 : తాళ్లపేట అంగన్‌వాడీ కేంద్రం-2లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం రాధిక, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, పద్మ, జ్యోతి, రాణి, పద్మ, ప్రమీళ, గర్భిణులు, బాలింతలున్నారు.

## ఎస్సీ రైతులకు ఆర్థిక తోడ్పాటు

కోటపల్లి, ఆగస్టు 5 : ఎస్సీ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేంద్రీయ మెట్ట పరిశోధనా సంస్థ తోడ్పాటునందిస్తుందని నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టీవీ ప్రసాద్, డాక్టర్ సుహానా అన్నారు. కోటపల్లి మండలం మల్లంపేటలోని ఎస్సీ సొసైటీకి ఎస్సీ సబ్ ద్వారా వంద శాతం సబ్సిడీపై మంజూరైన సీడ్ ప్లాంటర్‌ను రైతులకు అందచేశారు. రైతులకు ఉచితంగా వ్యవసాయ పరికరాలను అందచేయడంతో పాటు అత్యాధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి, అధిక లాభాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం రైతులకు వారి పొలాల్లో మట్టి పరీక్షల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాజ్‌కుమార్, ఎస్సీ సబ్ ప్లాన్ మండల కో-ఆర్డినేటర్లు సంపత్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

## 'సుప్రీం తీర్పు న్యాయబద్ధంగా లేదు'

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 5 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయ, రాజ్యాంగబద్ధంగా లేదని తెలంగాణ మాల మహానాడు విమర్శించింది. ఈ తీర్పును పునపరిశీలించి, తగు న్యాయం చేయవల్సిందిగా మంచిర్యాల కలెక్టర్‌కు జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్ సోమవారం లేఖ రాశారు. ఈవీ చిన్నయ్య కేసులో సుప్రీం కోరు తీర్పును పరిగణలోకి తీసుకోకుండా జడ్జిమెంట్ ఇచ్చినట్లు ఆరోపించారు. తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్తపు శంకరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు తదితరులు లేఖకు మద్దతు తెలిపారు.

కౌటాల, ఆగస్టు 5 : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని కోరుతూ దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్ మండలాల దళిత బహుజన నాయకులు ఉన్నారు.

**అదనపు కలెక్టర్‌కు వినతి..**

కాగజ్‌నగర్, ఆగస్టు 5: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు అఖిల పక్షం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పునపరిశీలించాలని కోరారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్ టౌన్, ఆగస్టు 5 : చెన్నూర్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. చెన్నూర్ 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కొనసాగుతున్నందున మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ముగ్గురికి నాన్‌బెయిలబుల్ వారెంట్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : వరకట్న వేధింపుల కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుంటున్న ముగ్గురికి మొదటి ఆదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నిరోష నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు సోమవారం మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్ తెలిపారు. 2019లో రిజిస్టర్ అయిన వరకట్న వేధింపుల కేసులో సీసీసీ నస్పూర్ ఆర్కే-5 కాలనీకి చెందిన తనుగుల మధుకర్, తనుగుల ప్రమీల, తనుగుల నారాయణ కొద్ది రోజులుగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మహిళా పోలీస్ స్టేషన్ ఎన్‌బీ డబ్ల్యూటీం వీ రాజేశ్, జీ రామేశ్వర్ రావు, టీ నరేశ్, మహిళా కానిస్టేబుల్ పద్మ అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చనట్లు తెలిపారు. ఈ మేరకు తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

## రైతు వేదికలో వరుస దొంగతనాలు

చింతలమానేపల్లి, ఆగస్టు 5 : మండలంలోని రైతు వేదికల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. గతంలో గుర్తుతెలియన వ్యక్తులు రుద్రాపూర్ రైతు వేదిక తలుపులు పగులగొట్టి ఫర్నిచర్, ఫ్యాన్లు ఎత్తుకెళ్లారు. బాలాజీ అనుకోడలో బోరు మోటర్‌తో పాటు పైప్ వైర్లు దొంగిలించారు. తాజాగా బాలాజీ అనుకోడ రైతు వేదికలో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి సామగ్రి ఎత్తుకెళ్లారు. ఇటీవల రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సిస్టమ్ బ్యాటరీ దొంగిలించడంతో పాటు, రిసీవర్‌ను బురదలో పడేశారు. సోమవారం ఉదయం రైతు వేదిక తలుపులు తెరిచి ఉండడం గమనించిన స్థానికులు ఏఈవో శ్రీలతకు సమాచారం ఇచ్చారు. మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ప్రధాన రహదారి పక్కనే రైతు వేదికలో వరుసగా చోరీ జరగడం గమనార్హం. దీనిపై మండల వ్యవసాయాధికారి రామకృష్ణను సంప్రదించగా, చోరీ విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు.

## నూతన కార్యవర్గం

లక్షెట్టిపేట, ఆగస్టు 5 : పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో భారత కమ్యూనిస్టు పార్టీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మేదరి దేవవరం, సహాయ కార్యదర్శిగా కేతిరెడ్డి రమణారెడ్డి, కోశాధికారిగా లింగంపల్లి బానుచందర్, కార్యవర్గ సభ్యులుగా దుర్గం దేవదాసు, ఆవునూరి వెంకటేశ్, రాచర్ల రవికిరణ్, ఆకుల రామన్న, బైరి రాజన్న, తిప్పని సత్తన్న, చింతల ఐలయ్య, జూల పోచయ్య ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి సమక్షంలో నిర్వహించారు.

## సమస్యలపై పోరాడాలి

లక్షెట్టిపేట, ఆగస్టు 5 : పట్టణంలో నెలకొన్న సమస్యలపై పోరాడాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రజినీష్ చంద్‌జైన్ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో సోమవారం పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలతో చర్చించాలని, పట్టణంలో ప్రజలు ఎదురుకుంటున్న ప్రధాన సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనానరు. పార్టీ పట్టణాధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు నరేశ్ చంద్‌జైన్, మోటపలుకుల తిరుపతి, గుండా ప్రభాకర్, రమేశ్ చంద్, శక్తి ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## అక్రమ పరిహారంపై ఫిర్యాదు

కాసిపేట, ఆగస్టు 5 : కాసిపేట మండలం పెద్దనపల్లి శివారు సర్వే నంబర్ 5లో ప్రభుత్వ భూములకు అక్రమంగా పరిహారం పొందాలని కుట్ర చేస్తున్నారని, ఆ ప్రయత్నాలు నిలిపివేయాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, నాయకులు చింతల సాయి వంశీ వినతి పత్రం అందించారు. సర్వేనంబర్ 5లోని ప్రభుత్వ భూమి కేకే-2 ఉపరితల గనిలో ముంపునకు గురవుతున్నదని, అదునుగా కొందరు ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నామని పరిహారం పొందే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కుమ్మక్కై కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై కాసిపేట మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వివరించారు. కలెక్టర్ స్పందించి, విచారణ చేయాలని కోరారు. దీనిపై పూర్తిగా విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు.

## బియ్యం పట్టివేత

పెంచికల్‌పేట్, ఆగస్టు 5 : కొండపల్లిలో కొండ్ర శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఎస్ఐ కొమురయ్యతో కలిసి సోదాలు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లో అప్పగించి, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కిరాణా దుకాణాల్లో పోలీసుల తనిఖీ

నెన్నెల, ఆగస్టు 5 : గ్రామాల్లో గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నెన్నెల ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో సోమవారం ఆయన తనిఖీ చేశారు.

తాండూర్, ఆగస్టు 5 : తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు దుకాణాలను సిబ్బందితో కలిసి ఎస్ఐ డీ కిణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మత్తు పదార్థాలు, గంజాయి, పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాసిపేట, ఆగస్టు 5 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణాల్లో ఏఎస్ఐ బూర రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి, ఆగస్టు 5 : మందమర్రి పట్టణంలోని పాఠశాలల సమీపంలో ఉన్న పలు దుకాణాలను సిబ్బందితో కలసి ఎస్ఐ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు.

బెల్లంపల్లి, ఆగస్టు 5 :తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల వంద దుకాణాలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుకాణాలను ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాళ్లగురిజా, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

కన్నెపల్లి, ఆగస్టు 5 : కన్నెపల్లి, భీమిని మండలాల్లోని దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలకు వంద మీటర్లలోపు దుకాణాల్లో మత్తు పదార్థులు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జైపూర్, ఆగస్టు 5 : జైపూర్ మండలం శెట్‌పల్లిలోని కిరాణా దుకాణాలను ఎస్ఐ శ్రీధర్ తనిఖీ చేశారు. దుకాణాల్లో గుట్కా, పాన్ మసాల ఉత్పత్తులు అమ్మరాదని సూచించారు.

## శ్రద్ధ తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : గిరిజన విద్యార్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ ఉపసంచాలకురాలు రమాదేవి అన్నారు. తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, శిక్షణ క్యాంప్ ఇన్‌చార్జి కృష్ణారావు, డీఎస్‌వో మీనారెడ్డి అసిఫాబాద్ ఏటీడీవో చిరంజీవి, మంచిర్యాల ఏసీఎంవో రాజమౌళి, మంచిర్యాల, ఆసిఫాబాద్ రిసోర్స్ పర్సన్ మడావి శంకర్, ఏ వామన్‌రావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభిజిత్, మీనాక్షి, పవన్, నిక్షిత ఆంగ్ల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మా జైపూర్ కమిటీ

జైపూర్, ఆగస్టు 5 : ట్రస్మా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జైపూర్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జైపూర్ మండల ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడిగా గూడ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా బషీరుద్దీన్, కోశాధికారిగా ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా మోహిద్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెట్టం మల్లేశ్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి శ్యాం సుందర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పరిశీలకులుగా వ్యవహరించారు.

## ఇసుక లారీ పట్టివేత

హాజీపూర్, ఆగస్టు 5 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. రాపల్లి స్టేజి వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా, అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకున్నామన్నారు. ఇసుక తాండూర్ నుంచి జగిత్యాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతు బిడ్డా.. మూడు ఉద్యోగాలకు ఎంపిక



కొత్తూరు రాజ్‌కుమార్

సిర్పూర్(టీ), ఆగస్టు 5 : పట్టుదల, ఆత్మ సైర్థ్యంతో ముందుసాగితే అనుకున్నది సాధించవచ్చని నిరూపించాడు సిర్పూర్(టీ) మండలకేంద్రానికి చెందిన నిరుపేద రైతు బిడ్డ కొత్తూరు రాజ్‌కుమార్. నాగుబాయి, నాగయ్య దంపతుల కొడుకు రాజ్‌కుమార్ ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన మిషన్ భగీరథలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా, అలాగే ఇంతకుముందు పాలిటెక్నిక్ లెక్చరర్‌గా, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆర్గనైజేషన్‌లో మొత్తంగా మూడు ఉద్యోగాలు సాధించాడు. రాజ్‌కుమార్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 2013లో పదోతరగతి చదువుకున్నాడు. అనంతరం బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ సివిల్ ఇంజినీర్, వరంగల్ నీట్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. 2021 చెన్నైలో ఎల్ అండ్‌టీ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేశాడు. 2023లో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ అన్‌బ్లాక్ మంత్రిత్వ శాఖలో సైంటిస్ట్ బీ ఉద్యోగం సాధించాడు. అంతటితో ఆగకుండా 2023 టీజీపీఎస్సీ ప్రకటించిన మిషన్ భగీరథ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆర్గనైజేషన్, పాలిటెక్నిక్ ఉద్యోగాలకు ప్రకటన చేయడంతో దరఖాస్తు చేసుకొని, పరీక్షలు రాశాడు. ప్రస్తుతం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. అలాగే గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. కేంద్ర మంత్రిత్వ శాఖలో ఉద్యోగం చేస్తూనే ఇతర ఉద్యోగాలకు పరీక్ష రాసి, ఉత్తీర్ణత సాధించిన కొత్తురు రాజ్‌కుమార్‌ను మండల ప్రజలు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

## పేకాట స్థావరాలపై దాడులు

సీసీసీ నస్పూర్, ఆగస్టు 5 : సీసీసీ నస్పూర్‌లో పేకాట స్థావరంపై సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. లక్ష్మీనగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి, లక్ష్మీనగర్‌కు చెందిన ఎండీ గౌస్, నాగార్జునకాలనీకి చెందిన దాసరి చంద్రమౌళి, పిట్టకారి సాగర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నెల్కి సుగుణాకర్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన మరో వ్యక్తి ఎండీ అజీమ్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.5610, మూడు మొబైల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

మందమర్రి, ఆగస్టు 5 : రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి గద్దరాగడి ప్రాంతంలో సుంకరి శంకర్, పోలవేని చంద్రయ్య, తుటి రమేశ్, కూర్మ శివ, క్రిమిండ్ల శ్రీను, నారా రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సిబ్బందితో కలిసి ఎస్ఐలు ఉపేందర్, లచ్చన్న దాడులు చేసి వీరిని పట్టుకున్నట్లు, మరో ఐదుగురు గుర్రం రాజ్‌కుమార్, కూర్మ సందీప్, తుటి లచ్చన్న, గుర్రం వినోద్, గుర్రం రాకేశ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.21,450, ఆరు మొబైల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం రామకృష్ణాపూర్ పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : మంచిర్యాలలోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో పేకాట ఆడుతున్న అశోక్‌రోడ్డుకు చెందిన గట్టయ్య, గద్దెరాగడికి చెందిన బింగి రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నటుల మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఎస్ఐ సురేశ్, ఏఎస్ఐ సత్తయ్య, హెడ్ కానిస్టేబుల్ బాబాజీ, కానిస్టేబుల్ భరత్, రమేశ్ దాడులు చేశాడరు. గమనించిన మరో నలుగురు నరేశ్, సురేశ్, ప్రదీప్, ఆటో సాయి పారిపోయారని పేర్కొన్నారు. వారి నుంచి రూ.8,300, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసిట్లు తెలిపారు.

## బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు

బెల్లంపల్లి, ఆగస్టు 5 : బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కే శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి కమిషనర్ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత స్వాగతం పలికారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

CHANGE OF NAME
I, SABLE VIJAY KUMAR (Old Name) S/o. SABLE DASHRATH, R/o.H.No.2-62, Vill & Post: Mannur, Mdl: Gudihatnoor, Dist.Adilabad, is hereby declare that, I shall known as "SABLE VIJAY" as per my all Indentification Proofs, Hence Declared

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677